క్లుప్తంగా

నిర్మాణ పనుల పరిశీలన



ఏలేరు నది వద్ద పనులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏలేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఏలేరు నది వద్ద చేపట్టిన నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. పనుల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివరాత్రి దగ్గర పడుతున్నా పనుల పూర్తికాలేదన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. పుణ్యస్నానాలకు వచ్చే వేలాది మంది భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై అధికారులకు చిత్తశుద్ధి లేదన్నారు. శివరాత్రికి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, కోరాడ ప్రసాద్, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



తిరుమాలిలో ప్రతిష్ఠించిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో శుక్రవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలోని ఏటివారిపేటలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీదేవి, గణపతి, సీతారాముల పట్టాభిషేక విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలుత పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశపూజ, నవగ్రహ హోమం, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.


100 రోజులు పని కల్పించాలి



కె గోపాలపురంలో ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

గండేపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు 100 రోజులు పనిదినాలు కల్పించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కె.గోపాలపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ 25 ఫారం పాండ్ వర్కులు ప్రతిపాదించాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏపీఓ ఆర్.గంగాభవాని, ఈసీ పి. రమేష్, సాంకేతిక సహాయకులు మోహన్ బాబు, శ్రీను, అబ్బులు పాల్గొన్నారు.

రైతు ఫిర్యాదుపై విచారణ



మురారిలో భూమిని పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

గండేపల్లి: మండలంలోని మురారికి చెందిన జాస్తి రమేష్ తన భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశాకు. దీనిపై డిప్యూటీ కలెక్టర్ రత్నమణి, డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు శుక్రవారం విచారణ చేపట్టారు. దరఖాస్తుదారుని పొలాన్ని పరిశీలించారు. భూమి రికార్డులు, ఇతర వివరాలను నమోదు చేసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక మోడల్ స్కూల్‌లో 6 తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోనూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రేషన్ బియ్యం.. రైట్ రైట్

- చాపకింద నీరులా సాగుతున్న వ్యాపారం
- రహస్య ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు
- గుట్టుచప్పుడు కాకుండా రైసుమిల్లులకు తరలింపు
- అధికారుల అండదండలతోనే దందా !



కోటనందూరులోని ఓ రైసుమిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)



స్టాక్ పాయింట్‌కు ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చిన రేషన్ బియ్యం

కోటనందూరు: రేషన్ బియ్యం అక్రమాలను అడ్డుకోవడంలో కూటమి సర్కారు ఆరంభ శూరత్వం ప్రదర్శించింది. రేషన్ మాఫియాను నిలువరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో జిల్లాస్థాయి అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. పాత అధికారుల స్థానంలో కొత్త అధికారులు వచ్చినప్పటికీ కోటనందూరు మండలంలో రేషన్ మాఫియాకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. నేటికీ యథేచ్ఛగా రేషన్‌దందా సాగుతూనే ఉంది. గతానికి కాస్త భిన్నంగా చాపకిందనీరులా ప్రశాంత వాతావరణంలో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతోంది. ఇంత ప్రశాంతతకు కారణం సంబంధిత అధికారుల అండదండలేనని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. గట్టే చేను మేసినట్టు నిలువరించాల్సిన అధికారులే మాఫియాకు సహకరిస్తే నిలువరించడం సాధ్యమవుతుందా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తిలా పాపం తలా పిడుకుడు అన్నట్లుగా పేదోడి నోట్లో మట్టి కొట్టి మాఫియా, రైసు మిల్లర్లు, అధికార యంత్రాంగం అక్రమ సొమ్ములను పంచేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

250 ద్విచక్ర వాహనాలపై...

కోటనందూరు మండలంలో 250 మందికి పైగా ద్విచక్ర వాహనాలపై ఊరూరా తిరిగి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వీరు కోటనందూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాలైన అనకాపల్లి జిల్లాలోని నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, చింతపల్లి, రాజఒమ్మంగి తదితర మండల నుంచి రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని కొంత మార్జిన్‌కు రేషన్ అక్రమాల్లో ఆరితేరిన 10 మంది వరకూ కోటనందూరులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లలో విక్రయిస్తున్నారు. రైసుమిల్లర్లు వారి పరిధిలో ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి ప్రతిరోజూ రాత్రి వేళ బియ్యాన్ని సేకరించి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారమంతా గుట్టుచప్పుడు కాకుండా బాహాటంగానే జరుగుతున్నా..అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

100 శాతం విక్రయం

రేషన్ బియ్యాన్ని నేడు లబ్ధిదారులు వినియోగించుకునే పరిస్థితి లేదు. కూలీ పనులు చేసుకునే నిరుపేదలు సైతం సన్న (నాణ్యమైన) బియ్యాన్ని తినడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం 100 శాతం నల్లబజారుకు తరలిపోతోంది. చాలా మంది లబ్ధిదారులు బియ్యాన్ని కనీసం ఇంటికి కూడా తీసుకెళ్లకుండా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వాహనాలు(ఎండీయూ) దగ్గరే విక్రయించేస్తున్నారు. లబ్ధిదారులు ఎండీయూ వాహనం దగ్గర వేలిముద్ర వేస్తే చాలు క్షణాల్లో ప్రక్కనే ఉన్న బియ్యం కొనుగోలుదారు నుంచి లబ్ధిదారుడి బ్యాంకు అకౌంట్‌కు డబ్బు జమైపోతోందంటే బియ్యం మాఫియా రేంజ్ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

16 వేల కార్డులు

కోటనందూరు మండలంలో 16 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డులకు సంబంధించి ప్రతి నెలా 2 వేల టన్నుల బియ్యం విడుదల అవుతాయి. ద్విచక్రవాహనదారులు 10 మండలాల నుంచి బియ్యం కొనుగోలు చేసి కోటనందూరులో విక్రయిస్తున్నట్లు సమాచారం.

కేసులు నమోదు చేశాం

రేషన్‌బియ్యం నిల్వలు, కొనుగోలుదారులపై ఉక్కుపాదం మోపుతున్నాం. తుని నియోజకవర్గంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశాం. అధికారుల పేరు చెప్పి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. రేషన్‌బియ్యం అక్రమాలు చేసేవారు ఎంతటి వారైన చర్యలు తప్పవు. లబ్ధిదారులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి తప్ప అక్రమార్కులను ప్రోత్సహించకూడదు.

బి.రాజు, పౌరసరఫరాల శాఖ అధికారి, కోటనందూరు

సమస్యలు పరిష్కరించాలని వినతి



రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియకు సమస్యలు వివరిస్తున్న మాధవరావు

తుని: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక రాష్ట్ర పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పి.మాధవరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాకినాడలో శుక్రవారం జరిగిన పెన్షన్ అండ్ జీపీఎఫ్ అదాలత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరులో జాప్యం లేకుండా చూడాలని, పీపీఓలో సరైన ఆధారాలు నమోదు కాని పక్షంలో తిరిగి నమోదు చేయాల్సిందిగా ఎస్‌టీఓకు ఆదేశాలు ఇవ్వాలని, పూర్వ పద్ధతిలో పెన్షనర్ల పేరు, స్టేషన్, స్టేట్‌మెంట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, రిటైర్ అయిన వాళ్లకు వెంటనే పెన్షన్ మంజూరయ్యేలా చూడాలని, పెన్షనర్లకు చెల్లించే కమ్యూనికేషన్, గ్రాడ్యుటీలను తొందరగా చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై ప్రిన్సిపల్ అకౌంటెంట్ సానుకూలంగా స్పందించారని సంఘ అధ్యక్షుడు మాధవరావు తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.20 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల శర్మ, సంతోష్ ఘనపాఠి, కోట వంశీ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, 20 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిర్దేశించిన ప్రకారమే రీ సర్వే చేపట్టాలి



రీ-సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

గోకవరం: నిర్దేశించిన ప్రకారమే భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని మల్లవరంలో జరుగుతున్న రీ సర్వే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సగటున సర్వే బృందాలు రోజుకు 15 ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందు కోసం 139 బృందాలను నియమించామని పురోగతి ఆ మేరకు లేదన్నారు. దేవరపల్లి మండలంలో 59.84 ఎకరాల్లో, గోకవరం మండలంలో 44.9 ఎకరాల్లో సర్వే పూర్తి చేయగా పురోగతిలో కొవ్వూరు 15.75 ఎకరాలు, గోపాలపురం 22.52 ఎకరాలతో దిగువన ఉన్నాయని తెలిపారు.

అక్షరాస్యతను పెంచేందుకే ఉల్లాస్ కేంద్రాలు



ప్రత్తిపాడులో శిక్షణ పొందుతున్న వయోజనులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రత్తిపాడు: వయోజనుల్లో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ఉల్లాస్ వయోజన విద్య శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. ప్రత్తిపాడులోని ఉల్లాస్ వయోజన విద్య శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శిక్షణ కేంద్రంలో వయోజనుల విద్యాభ్యాసాన్ని పరీక్షించారు. ఉల్లాస్ శిక్షణ ద్వారా ఏ మేరకు విద్యను నేర్చుకుంటున్నారు అని అభ్యాసకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించడమే ఉల్లాస్ శిక్షణ కేంద్రాల లక్ష్యమన్నారు. అభ్యాసకులకు వీడియోలు, సులభమైన బోధనా పద్ధతుల ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వై.వెంకట్, వెలుగు సీసీ శ్రీనివాస్, ఎంఎస్‌ఏ నాగేశ్వరరావు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి శివాలయాల ముస్తాబు



భూపాలపట్నం శివాలయం వద్ద వేస్తున్న చలువ పందిరి

కిర్లంపూడి: మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబు అవుతున్నాయి. మండలంలోని భూపాలపట్నం, సోమవరం, కృష్ణవరం, పాలెం-గోనేడ గ్రామాల్లోని శివాలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. భూపాలపట్నంలోని వేంచేసిన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం చలువ పందిళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు వీరంరెడ్డి కాశీబాబు మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఉదయం ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 28 వరకు ఆలయం వద్ద ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



భూపాలపట్నంలో వేణుగోపాలస్వామి హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కిర్లంపూడి: భూపాలపట్నంలో వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఏఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఆదాయ లెక్కింపు నిర్వహించారు. మూడు సంవత్సరాలకు గాను హుండీల ద్వారా స్వామివారికి రూ.1,22,700 ఆదాయం వచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కంచి మూర్తి, యనమల అప్పారావు, వెలగ రమేష్, కాకినాడ ఎండోమెంట్ డీసీ శ్రీనివాస్, వేణుగోపాలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

వైభవంగా అడవిరాజులబాబు పండగ



రమణయ్యపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



బిళ్లనందూరులో అడవిరాజులబాబు ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

కోటనందూరు: మండలంలోని బిళ్లనందూరు, కేఏ మల్లవరం గ్రామాల్లో అడవిరాజులబాబు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బిళ్లనందూరులో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, కేఏ మల్లవరంలో గాడి రాజబాబు ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళాల నడుమ గ్రామస్తులు ఊరేగింపుగా గ్రామ పొలిమేర్లలో ఉన్న అడవిరాజులబాబు ఆలయానికి వెళ్లారు. స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించారు. బంధుమిత్ర పరివారంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కొండరాజులబాబుకు గిరిబాబు పూజలు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే కొండరాజులబాబును శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకున్నారు. రమణయ్యపేటలోని కొండరాజులబాబు ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, సర్పంచ్ ములగపాటి సునీత, రమేష్ రాజు, పైల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

తుని రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ప్రపంచ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఎస్సీ, ఎస్టీ గురుకుల ఆశ్రమ పాఠశాలలు, లోవకొత్తూరులోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల, హంసవరం ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మాతృ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మాతృ భాష గొప్పదనాన్ని వివరించారు.

ముద్రగడను కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్



ముద్రగడను కలిసి మద్దతు కోరుతున్న సుందర్

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభాన్ని మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ శక్రవారం కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని ముద్రగడను కోరారు. ఆయన పలువురు నేతలు ఉన్నారు.

విలేకరిపై దాడికి నిరసన



సీఐ గీతారామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

తుని: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై ఆ మండల టీడీపీ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు చేసిన దాడిని ఖండిస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విలేకరిపై దాడి చేసిన టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పట్టణ సీఐ గీతారామకృష్ణ, తహసీల్దార్ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. పలువురు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యలో టెక్ కాన్ఫరెన్స్-2కే25

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం టెక్ కాన్ఫరెన్స్-2కే25 కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. తొలిరోజు సీనియర్ క్లౌడ్ అండ్ డెవలప్స్ ఇంజినీర్ గీతికా యర్రంశెట్టి, ఐబీఎంఏఐ ఇంజినీరింగ్ మేనేజర్ ప్రియా రామన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగంలో తాజా అభివృద్ధి, పరిశ్రమల్లో ఏఐ భవిష్యత్తు తదితర అంశాలను వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, డీన్ అకాడెమిక్ పి.రవి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హైవే జంక్షన్ వద్ద వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక సంతోషి మాత ఆలయ జంక్షన్ వద్ద వీధిదీపాలు ఏర్పాటు చేయాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవే కూడలి వద్ద రాత్రులు సరైన వెలుతురు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల పోలీస్ స్టేషన్ వరకూ చేరని ప్రమాదాలెన్నో చోటు చేసుకున్నాయన్నారు. గతంతో హైవే అథారిటీ సిబ్బంది ఈ జంక్షన్‌లో దీపాలు ఏర్పాటు చేయడం మరిచిపోయారని, ఇకపై ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.


విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

శంఖవరం: రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ఉంటేనే రానున్న కాలంలో ప్రభుత్వం నుంచి పథకాలు, రాయితీలు, సబ్సిడీలు అందుతాయని తెలిపారు. రైతులు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



కీర్తి వర్షిణి



అరిటాకుల ఉదయభాను



వంజారి కార్తీక్

కోటనందూరు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ప్రవేశ పరీక్షలో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గతేడాది డిసెంబర్‌లో పరీక్ష రాసిన 8వ తరగతి విద్యార్థులు కీర్తి వర్షిణి, అరిటాకుల ఉదయభాను, వంజారి కార్తీక్ విశేష ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం వీరికి సంవత్సరానికి రూ. 12 వేలు చొప్పున ఐదు సంవత్సరాలు (ఇంటర్మీడియెట్ వరకూ) పాటు ఉపకార వేతనం అందిస్తుంది. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం ఎన్. వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.